క్లుప్తంగా

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



మద్నూర్(జుక్కల్): ఎన్నో సంవత్సరాలుగా మద్నూర్ ప్రజలు వేచిచూస్తున్న కేంద్రీయ విద్యాలయం మద్నూర్‌కు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసి ఎమ్మెల్యే ఫోటోకు పాలతో అభిషేకం చేశారు. కేంద్రీయ విద్యాలయం కోసం గతంలో పలువురు అమరణ నిరాహార దీక్ష సైతం చేపట్టారని గ్రామస్తులు పేర్కొన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



దోమకొండ: చేనేత ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా దోమకొండ గ్రామానికి చెందిన బొమ్మెర శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడు సబ్బని ధర్మపురి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదేశాల మేరకు నియామకం చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఐక్యవేదిక జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన అవదూత సహదేవ్‌ను సైతం నియమించారు. వీరి నియామకం పట్ల పద్మశాలి సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కళాశాల ఆకస్మిక తనిఖీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, లెక్చరర్ల అటెండెన్స్, సంవత్సర ప్రణాళికలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడి తట్టుకొని సమర్థవంతంగా ముందుకు వెళ్లే విధంగా లెక్చరర్లు కృషి చేయాలని కోరారు. అనంతరం కేజీబీవీ, మైనార్టీ, ఎక్లార్ రెసిడెన్సియల్ కళాశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం వడ్డించాలని మహమ్మద్‌నగర్ మండల విద్యాశాఖాధికారి అమర్ సింగ్ సూచించారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంతో పాటు నిత్యావసర సరుకులను పరిశీలించారు. భోజనం తయారు చేసే ప్రాంతంలో పాటు పాత్రలను, కూరగాయలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల విరాళం



ఎల్లారెడ్డిరూరల్: అడివిలింగాల జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన సంఘమేశ్వర్ రెడ్డి రూ.50 వేల విరాళం అందించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శివనర్సింహారావు బుధవారం తెలిపారు. పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన శశికళ- బాల్‌రెడ్డి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సంఘమేశ్వర్‌రెడ్డి విరాళం అందించినట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి..



దోమకొండ: మండల కేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న ప్రసాదసేవా సమితికి ముత్యంపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ముత్తగారి శిరీష్‌గౌడ్ బుధవారం రూ.20వేల విరాళం అందజేశారు. శిరీష్‌గౌడ్ తండ్రి ముత్తగారి సాయగౌడ్ జ్ఞాపకార్థం కుమారులు శిరీష్ గౌడ్, రాహుల్ గౌడ్ విరాళంగా అందజేశారు. అదేవిధంగా ఆలయ వార్షికోత్సవానికి రూ.5,100 అందజేశారు. అయ్యప్ప సేవా సంఘం సభ్యులు నర్సారెడ్డి, స్వాములు కంది వినోద్, నల్లపు సంతోష్, నార్ల వెంకటేశం, పోతుల రాజు, పాలకుర్తి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు

- బాన్సువాడ పట్టణంలో పలుచోట్ల రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనచోదకులు
- సమస్యను పట్టించుకోని పోలీసు శాఖ



బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా వద్ద అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు

బాన్సువాడ: బాన్సువాడలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు.. ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. దానికి తోడు ఇష్టారీతిన వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు అధికమవుతున్నాయి. ప్రధాన చౌరస్తాలలో వాహనాలు ఎటు నుంచి ఎటు వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి. సిగ్నల్ వ్యవస్థ ఉన్నప్పటికీ ..ఆ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించేందుకు హోంగార్డులున్నప్పటికి వారిని పట్టించుకునే వారే లేరు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి బస్ డిపో వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు వ్యాపార సముదాయాల ముందు రోడ్లపై పార్కింగ్ చేయడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వ్యాపారులు అద్దెలకు ఆశపడి దుకాణాల ముందు రోజు వారి వ్యాపారులకు అద్దెకు ఇవ్వడంతో ఆయా దుకాణాల ముందు వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా తాడ్కోల్ చౌరస్తా, స్టేట్ బ్యాంకు, అంబేడ్కర్ చౌరస్తా, పాత బాన్సువాడకు వెళ్లే దారిలో, బీసీ హాస్టల్ రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్య నిత్యం ఉత్పన్నం అవుతోంది.

ప్రతి గురువారం సంత రోజున మరీనూ..

ప్రతి గురువారం బాన్సువాడలో సంత ఉంటుంది. ఆ రోజు రోడ్డుపై వెళ్లే వారికి నరకం కనబడుతోంది. రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడంతో పాటు ఆటోలు రోడ్డుపై నిలపడంతో వచ్చి, పోయే వారికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్టాండ్, తాడ్కోల్ చౌరస్తా వద్ద రోడ్డుపైనే ఆటోలు నిలపడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నాలుగు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరైనప్పటికి కేవలం అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాత్రమే సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి మిగతా తాడ్కోల్ చౌరస్తా, బీసీ హాస్టల్ రోడ్డు, పాత అంగడి బజార్లలో ఇప్పటికీ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పోలీస్ శాఖ అధికారులు ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని, రోడ్డుపై పార్కింగ్ చేసే వాహనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



ధర్మారెడ్డిలో సర్వేను పరిశీలిస్తున్న నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి



తాడ్వాయిలో వివరాలను సేకరిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ధర్మారెడ్డిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. సర్వేలో భాగంగా యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై ఆయన ఆరా తీశారు. దరఖాస్తుదారుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు ఆయన సూచించారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు దేమికలాన్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పర్యటించి ఇల్లులేని నిరుపేదల వివరాలను సేకరించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, తహసీల్దార్ రహిమొద్దీన్, హౌసింగ్ ఈఈ ప్రభాకర్, ఎంపీవో సవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమి స్వాధీనం



నిజాంసాగర్(జుక్కల్): సుల్తాన్ నగర్ శివారులోని ఎరుకలవాణి కుంట శిఖం కబ్జా భూమిని బుధవారం నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులు జేసీబీ సహాయంతో కందకాలు తవ్వించి స్వాధీనం చేసుకున్నారు. చెరువు శిఖం భూములు కబ్జా చేస్తుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ భిక్షపతి అన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి



కామారెడ్డి అర్బన్: గీతా జయంతి సందర్భంగా బుధవారం స్థానిక రాంరెడ్డిరోడ్డులోని అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్)లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం, భజనలు, అన్నప్రసాదం వితరణ చేశారు. జీవితంలో ప్రతి సమస్యకు భగవద్గీతలో పరిష్కారం లభిస్తుందని, ప్రతిరోజు కనీసం ఒక భగవద్గీత శ్లోకం పఠించాలని ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ ప్రభు అన్నారు. గీతా జయంతి ఉత్సవంలో మహిళలు, పిల్లలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



కామారెడ్డి రూరల్: పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్యాసంపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించి 43 గేదెలు, 4 ఆవులకు చికిత్స చేశారు. ఐదు గేదెలకు కృత్రిమ గర్భధారణ, 21 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పాడిరైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో క్యాసంపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పశువైద్యులు రవికిరణ్, భగవాన్‌రెడ్డి, మణికుమార్, సూపర్‌వైజర్ కృష్ణ, గోపాలమిత్రలు శ్రీనివాస్, బాబాగౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

14న ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ ప్రారంభం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో ఈ నెల 14న ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ ప్రారంభిస్తున్నట్లు ఆయుష్ శాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎ. శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని డిస్పెన్సరీని స్థానిక మున్సిపల్ 14వ వార్డులోని ఫ్రీడం ఫైటర్ భవనంలోకి మార్చుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఔట్ పేషెంట్ సర్వీస్ కూడా పొందవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

తాడ్వాయి/లింగంపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని గ్రంథాలయాలను ఆదర్శ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన లింగంపేట, తాడ్వాయి గ్రంథాలయాలను సందర్శించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్, జిల్లాలోని ఎమ్మెల్యేల సహకారంతో గ్రంథాలయాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. యువత, విద్యార్థులకు పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుకొని 230 మంది యువకులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు గుర్తు చేశారు. ఇంకా పోలీస్ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అవసరమైతే తన దృష్టికి తీసుకువస్తే రెండు, మూడు రోజుల్లో అందుబాటులో ఉంచుతానన్నారు. జిల్లాలోని ఆయా గ్రంథాలయాలకు గ్రామ పంచాయితీల నుంచి రూ.2.30 కోట్లు సెస్సు రావాల్సి ఉందన్నారు. దాతల సహాయంతో గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీఎంతో మాట్లాడి గ్రంథాలయాలలో ఖాళీలను భర్తీ చేయడానికి కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది మౌనిక, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, రాజుపటేల్, కొడ రవి, ఖాసీం, నగేష్, సుప్పాల రాజు, సాయికుమార్, సలీం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు



బాన్సువాడ: బాన్సువాడలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం సైన్స్ ఫెయిర్ విజయవంతం కావడానికి కృషి చేసిన వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ బాన్సువాడలో నిర్వహించేందుకు ముందుకు వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక అభినందనలని ఆయన అన్నారు. మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా వెంకట ఖాజా దర్గా ఉత్సవాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్‌లోని వెంకట ఖాజా దర్గా ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లా వట్‌పల్లిలోని వెంకట ఖాజా దర్గా పీఠాధిపతి ముకుందరావు ఆధ్వర్యంలో దర్గా ఉత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వెంకట ఖాజా భక్తులు గ్రామం నుంచి గంధం, చాదర్‌ను ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాకు సమర్పించారు. ప్రత్యేకప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా వద్ద ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన



దేశాయిపేట్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

బాన్సువాడ రూరల్: బ్యాంకింగ్ సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ కెనెరా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ స్వాతి అన్నారు. బుధవారం ఆమె దేశాయిపేట్‌లో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలని, నామినీ పెట్టుకోవాలన్నారు. అలాగే బ్యాంకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇన్సూరెన్స్‌లను పొందాలన్నారు. అంబుడ్స్‌మన్ వ్యవస్థ, డిజిటల్ పేమెంట్స్, సైబర్‌నేరాల గురించి అవగాహన కల్పించారు. బ్యాంకుల ద్వారా అందుతున్న ఇతర సేవలు, రుణసదుపాయాల గురించి వివరించారు. ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్స్ బాలకృష్ణ, అనుదీప్, పర్వయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వంట చేసే వ్యక్తులు పరిశుభ్రత పాటించాలి



రాజంపేట: వంట చేసే వ్యక్తులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జల్ జీవన్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ సొసైటీ సంస్థ డైరెక్టర్ వెంకటలక్ష్మి సూచించారు. రాజంపేట కేజీబీవీలో బుధవారం న్యూట్రిషన్ ఫుడ్ సేఫ్టీ హెల్దీ ఫుడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. తాజా కూరగాయలు వండే విధంగా చూడాలని, వంట చేసే వ్యక్తులు చేతి గ్లౌజులు, నోటి మాస్కులు, హెడ్ క్యాప్స్ తప్పకుండా ధరించాలని సూచించారు. అలాగే విద్యార్థులు కూడా పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, మంచి విద్య నేర్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ ఫామ్ సందర్శన



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ జంతుశాస్త్ర విభాగానికి చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి ఐలయ్య ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేటలో ఉన్న పట్టు పరిశ్రమ ఫామ్‌లను సందర్శించారు. పట్టు పరిశ్రమల నిర్వహణ, పట్టు పురుగుల పెంపకం మల్బరీ కల్చర్ మొదలైన అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహణతో పాటు నైపుణ్యాల గురించి ఐలయ్య విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు నాగేందర్, నర్సింలు, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నశీల, అధ్యాపకులు సునీల్ కుమార్, విజయ్ కుమార్, శ్రీకాంత్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన నర్వ గ్రామ జట్టు



నిజాంసాగర్‌లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



నస్రుల్లాబాద్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు



రాజంపేటలో క్రీడాకారులతో అధికారులు, పీఈటీలు



విజేతగా నిలిచిన అడ్లూర్ ఎల్లారెడ్డి విద్యార్థులు



పిట్లంలో విజేతలతో అధికారులు, ప్రజాప్రతినిధులు



గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో విజేతలతో కాంగ్రెస్ నాయకులు, అధికారులు

క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించగా.. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పలువురు క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరు: కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన జంగంపల్లి జట్టు



మద్నూర్‌లో డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు



మాచారెడ్డి: విజేతలతో ఉపాధ్యాయులు

కాలనీ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న బీసీ కాలనీవాసులు

రాజంపేట: మండల కేంద్రంలోని నూతన బీసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు బుధవారం రోడ్డుపై ధర్నా కార్యక్రమం చేపట్టారు. దీంతో గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాలనీలో నీటి కొరత, డ్రైనేజి సమస్య, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సీసీ రోడ్ల వంటి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల గురించి గతంలో పలుమార్లు ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని తెలిపారు. విషయం తెలిసి ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, మిషన్ భగీరథ ఏఈ రజిత ఘటనా స్థలానికి చేరుకొని కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీ సమస్యలు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎంపీడీవో రఘురాం, ఇతర అధికారులు హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ధర్నా విరమించారు.

సంక్షిప్తం

12వ వార్డులో గుంతల పూడ్చివేత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గుంతలను పూడ్చి వేయించినట్లు కౌన్సిలర్ నీలకంఠం బుధవారం తెలిపారు. కాలనీలోని పలు రోడ్లలో గుంతలు ఏర్పడటంతో వాటిలో మట్టిని పోసి గుంతలను పూడ్చి వేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

బాన్సువాడ రూరల్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని బాన్సువాడ ఎంపీడీవో నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన కొయ్యగుట్టలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ప్యానెల్ ఇన్‌స్పెక్షన్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు కేవలం తరగతి గదిలో పుస్తక బోధనకే పరిమితం కాకుండా విద్యార్థులకు అదనపు సమాచారం అందించాలని, వారిలోని నైపుణ్యాలను మెరుగుపర్చాలన్నారు. నిరంతర సమగ్రమూల్యాంకనం తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



గాంధారి(ఎల్లారెడ్డి): సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి సీఈఐఆర్ ద్వారా నాలుగు సెల్‌ఫోన్లు రికవరీ చేసి బుధవారం బాధితులకు అప్పగించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్‌కు బుధవారం ఎస్సై సుధాకర్ రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను అప్పగించారు. బాధితుడు సెల్‌ఫోన్ పోయినట్లు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం

గాంధారి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద విగ్రహాలకు పాలాభిషేకం చేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు రెడ్డి రాజు తెలిపారు. నాయకులు ప్రేమ్‌సింగ్, సురేష్, సంతోష్ తదితరులున్నారు.

వంద శాతం విద్యుత్ చార్జీల వసూలు

ఎల్లారెడ్డిరూరల్: మౌలాన్‌ఖేడ్ గ్రామంలోని రైతులకు సంబంధించిన వ్యవసాయ బోరుబావులకు సంబంధించిన బిల్లులు వంద శాతం వసూలు చేసినట్లు ఫోర్‌మెన్ గంగాధర్ బుధవారం తెలిపారు. గ్రామంలోని 31 వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన 12 వేల 229 రూపాయల విద్యుత్ బిల్లులు రైతులు చెల్లించినట్లు వెల్లడించారు. లైన్‌మెన్ బాలకిషన్, సిద్దేందర్‌రెడ్డి తదితరులున్నారు.

నిలిచిన భగీరథ నీటి సరఫరా

నిజాంసాగర్(జుక్కల్): సింగూరు జలాశయం ఫిల్టర్ బెడ్ మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచి పోయింది. మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో గ్రామ పంచాయతీల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సూచించారు.